దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

కొండపాక (కుకునూరుపల్లి) 8 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని శుక్రవారం కొండపాక బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు తన స్వగ్రామం పోతారంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొండపాక మండల మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు భాను, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లె బాబు, కెమ్మెరపారం శ్యామ్, ఎండీ. నయీముద్దీన్, ఎండీ.ముగ్దుమ్, సంతోష్, రాకేశ్ ఉన్నారు.

తొగుట డిసెంబర్ 8 : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని తన సొంత గ్రామం పోతారంలో తొగుట మండలంలోని వెంకట్రావుపేట, గుడికందుల, జప్తిలింగారెడ్డిపల్లి, లింగంపేట, ఎల్ బంజేరుపల్లి, తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ కేహరికృష్ణారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చిలువేరి మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కనకయ్య, సర్పంచ్ మల్లయ్య, నాయకులు, ఏపీవో కిషన్, మండల మహిళా సమైక్య సంఘాల బాధ్యులు ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), డిసెంబర్ 8 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో ఇటీవల బత్తుల జీవానందం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ షేర్ల కైలాసం, మిరుదొడ్డి మాజీ ఎంపీపీ పంజాల కవితాశ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పెండెల రమేశ్, నాయకులు ఉన్నారు.

వృత్తివిద్యా సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, డిసెంబర్ 8 : ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన కేంద్రంలో వృత్తివిద్యా సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రొఫెసర్ మమత ఒక ప్రకటనలో తెలిపారు. డీబీటీ-టీఎస్‌సీఏఎస్‌టీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు దోహదపడేలా నర్సరీల పెంపకం, వర్మీకంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకం, తదితర అంశాలపై ఆరు నెలల పాటు శిక్షణతోపాటు నెలకు రూ.10వేల స్టైఫెండ్ చెల్లిస్తామని తెలిపారు. డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు పత్రాలను కళాశాలలో సమర్పించాలని సూచించారు.

కేసీఆర్‌ను కించపరిస్తే సహించం

బెజ్జంకి, డిసెంబర్ 8: కాంగ్రెస్ నాయకులు యువతను రెచ్చగొట్టి, మాజీ సీఎం కేసీఆర్‌ను కించపర్చేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం తగదని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బిగుల్ల మోహన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. కొంతమంది యువనాయకులు కేసీఆర్‌ను కించపర్చేలా అసత్య ప్రచార పోస్టులు పెడుతున్నారని, ఇది మంచి సంస్కృతి కాదన్నారు. తప్పుడు పోస్టులు పెడితే సహించమన్నారు.

టీఎస్ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన గజ్వేల్ ప్రభుత్వ పీజీ కళాశాల విద్యార్థి

గజ్వేల్‌అర్బన్, డిసెంబర్ 8 : గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థిని మూట కోడూరు స్రవంతి ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన రాష్ట్రస్థాయి టీసెట్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు, లెక్చరర్లు తదితరులు స్రవంతిని సన్మానించడంతోపాటు ప్రిన్సిపాల్ ప్రోత్సాహకంగా రూ.వెయ్యి నగదును అందజేశారు.

ఫ్యాక్టరీని రద్దు చేయాలి

బెజ్జంకి, డిసెంబర్ 8: మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, డీఎల్‌పీవో వీరభద్రయ్య, కాలుష్య నివారణ జిల్లా అధికారి సాయిరాం శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ప్రతి ఆడపిల్ల అమూల్యమైంది

-ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ

దుబ్బాక ప్రభుత్వ దవాఖానలో స్వీట్లు అందజేస్తున్న సీడీపీవో చంద్రకళ, సిబ్బంది

దుబ్బాక టౌన్, డిసెంబర్ 8 : పుట్టిన ప్రతి ఆడపిల్ల ఎంతో అమూల్యమైందని, ఆమెను చదివించి శక్తివంతంగా చేద్దామని దుబ్బాక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో చంద్రకళ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో 'బాలికను రక్షిద్దాం-బాలికను చదివిద్దాం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా స్థానిక దవాఖానలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఐశ్వర్య, జిల్లా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ వాసవి, లావణ్య, పద్మ, పోషణ్ అభియాణ్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటప్రసాద్, దుబ్బాక బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్యామ్‌సన్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటకు అయోధ్య రాముడి అక్షింతలు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 8 : అయోధ్య శ్రీరామ చంద్ర మూర్తి అక్షింతలు సిద్దిపేటకు రావడం సంతోషదాయకమని విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ కార్యదర్శి గ్యాదరి రాజారామ్ అన్నారు. సిద్దిపేటకు అయోధ్య రాయాలయం నుంచి శుక్రవారం అంక్షితలు వచ్చాయి. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ పరివార్ ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి 15 వరకు గ్రామాల్లో గడపగడపకూ వెళ్లి అక్షింతలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నరేశ్, మురళీ, శ్రీనివాస్, నాగేందర్ పాల్గొన్నారు.

అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలకు స్వాగతం పలుకుతున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు

మొబైల్ అప్పగించిన పోలీసులు

చేర్యాల, డిసెంబర్ 8 : పట్టణానికి చెందిన అరకాల కనకరాజు అనే వ్యక్తి తన ఫోన్‌ను అక్టోబర్ 10న తేదీన పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చేర్యాల ఎస్సై రామ్మోహన్ సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నాడు. శుక్రవారం బాధితుడికి ఎస్సై స్టేషన్‌లో ఫోన్ అందజేశాడు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 8 : కార్తీక మాసంలోని ఏకాదశని పురస్కరించుకొని శుక్రవారం మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో నామ సంకీర్తన కార్యక్రమ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అర్చకుడు పార్నంది ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో భక్తులు హరేరామ, హరేకృష్ణ నామ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట, డిసెంబర్ 8 : తెలంగాణలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో ఎన్నికైన ఎమ్మెల్యేలకు టీఎన్‌జీవోస్ జిల్లా పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సహాధ్యక్షుడు నిమ్మ సురేందర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ములుగు ప్రజాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా మృతి

ములుగు, డిసెంబర్ 8 : మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జహంగీర్ సోదరుడు మహ్మద్ ఖాజాపాషా (65) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఎంపీపీ పెద్దబాల్ లావణ్యా అంజన్‌గౌడ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కూడూరి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మహదేవుని శ్రీనివాస్‌గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీఎస్ రెడ్‌కో ఆధ్వర్యంలో వర్క్‌షాప్

సిద్దిపేట, డిసెంబర్ 8 : బ్యూరో ఆఫ్ ఎనర్జీస్ తెలంగాణ రెడ్‌కో ఆధ్వర్యంలో సిద్దిపేట విపంచి కళానిలయంలో రిటెలర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. టీఎస్ రెడ్‌కో జిల్లా మేనేజర్ రామ్మోహన్, ప్రవీణ్‌కుమార్, న్యాక్ జిల్లా అధికారి రామేశ్వర్‌రావు హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శర్మ, బాల్‌నర్సు, వసంత పాల్గొన్నారు.

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

మిరుదొడ్డిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, డిసెంబర్ 8 : హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలువాలని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, మిరుదొడ్డి టౌన్‌లో సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ దార స్వామి, వార్డు సభ్యుడు మద్దెల చంద్రం, నాయకులు మొగుల్ల ఐలయ్య, దార మల్లయ్య, సత్తు బాల్‌రెడ్డి, సత్తు రాజిరెడ్డి, నేరండ్ల స్వామి, కుమ్మరి నర్సింహులు, ముక్కపల్లి రాజు, చంద్రారెడ్డి, బలిజ రమేశ్ పాల్గొన్నారు.

గజ్వేల్ ఏఎంసీ పాలకవర్గం రాజీనామా

గజ్వేల్‌లో రాజీనామా పత్రాన్ని కార్యదర్శికి అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్లు

గజ్వేల్, డిసెంబర్ 8: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులతో కలిసి శుక్రవారం తమ రాజీనామాను మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీకి అందజేసినట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన కేసీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. మూడున్నరేండ్లు తనకు సహకరించిన డైరెక్టర్లు, వ్యాపారులు, రైతులకు కృతజ్ఞతలు చెప్పారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

అక్కన్నపేట, డిసెంబర్ 8 : జిల్లా విద్యాశాఖ ద్వారా అమలవుతున్న 'ఉన్నతి' కార్యక్రమం లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థులకు బోధన చేసి విద్యాప్రమాణాలు పెంచాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన గణిత ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇప్పటి నుంచి అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, రిసోర్స్ పర్సన్ చంద్రారెడ్డి, ఎస్.రవీందర్, మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, సతీశ్, మురళి, సంపత్, రాజేందర్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 8 : పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి పోటీల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ కరీమొద్దీన్, పాఠశాల పీఈటీ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 13 నుంచి 15 వరకు నారాయణపేటలో జరిగే 67వ రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కరీమొద్దీన్, పీఈటీ గోవర్ధన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

చేర్యాల, డిసెంబర్ 8 : మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి అభ్యసిస్తున్న ఎం.సృజన అనే విద్యార్థి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.ఐలయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచిర్యాలలో ఈ నెల 8న ప్రారంభమైన హ్యాండ్‌బాల్ పోటీలు 10వ తేదీ వరకు కొనసాగే పోటీల్లో సృజన పాల్గొంటున్నట్లు తెలిపారు. సృజనను సర్పంచ్ చీపురు రేఖామల్లేశయాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ కోతి దాసు, ఉపాధ్యాయులు, పీఈటీ కవిత అభినందించారు.

జాతీయ పురస్కారానికి ఎంపికైన వీరన్నపేట సర్పంచ్

చేర్యాల, డిసెంబర్ 8 : మండలంలోని వీరన్నపేట గ్రామ సర్పంచ్ కొండపాక భిక్షపతి తెలుగు వెలుగు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలో తెలుగు వెలుగు సాహితీ వేదిక (జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ) ఆధ్వర్యంలో ఈ నెల 10న జాతీయ సాంస్కృతిక, సంగీత సాహిత్య సమ్మేళనం నిర్వహించనున్నారు. సమ్మేళనంలో తెలుగు వెలుగు కొత్తపల్లి జయశంకర్ జాతీయ పురస్కారాన్ని సర్పంచ్ అందుకోనున్నారు. సర్పంచ్ మూడోసారి తెలుగు వెలుగు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జాతీయ పురస్కారానికి ఎంపికకావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.